# ఆపద - సంపద

"వరద వస్తుందిట నాన్నా!" బుజ్జిగాడు అన్నాడు తండ్రి యింటికిరాగానే.

" మనవాడలో అందరూ ఇళ్లు వదలి పారిపోతున్నారు" పప్పి చెప్పింది.

" ఏమండి ఇంత ఆలశ్యం చేశారు రావడానికి?" భార్య నందిని ప్రశ్న.

" మరేం ఫర్వాలేదు-ఏం కంగారు పడకండి-ప్రతి సంవత్సరం కర్నాటకలో వర్షాలు పడ్డం - మన సుంకేసులకు నీళ్ళు వదలడం మామూలేగా - హంద్రీకి వరదలొచ్చినా - తుంగభద్రకు వరదలొచ్చినా మనలాంటి వాళ్ళకు ఏమీ కాదు. బాగా పల్లంలో వున్నోళ్లకి కాస్త నీళ్లు వచ్చి వెళతాయి". చెప్పాడు ధైర్యంగా నరహరి, బంగారు అంగడి మూసి వచ్చేయడం కాస్త ఆలస్యం అయింది.

" ఆ! నేనూ చెబుతూనే ఉన్నాను-మహా అయితే ఓ అడుగు నీళ్ళు వస్తాయి - దానికింత కంగారు పడతారెందుకని - కాని మన చుట్టు ప్రక్కల వాళ్లు వినకుండా ఇళ్లు ఖాళీ చేసి వెళ్ళిపోయారు. మనమూ పోదాం పదండి." నందిని ముందు చూపుతో చెప్పింది.

" నిజమే - ఇలా హఠాత్తుగా ఇళ్లు వదిలి పొమ్మంటే ఎక్కడికి పోతాం?"

" అందరూ జగన్నాథగట్టు పైకి పోతున్నారట గదా?" నందిని.

" ఏం, ప్రభుత్వం ఏమన్నా గాడీలు ఏర్పాటు చేసిందా?"

" అదెందుకు చేస్తాది....... వరద హెచ్చరికలు చేసింది."

" సరే! నీకు నాకు కావాల్సినవి ఓ సూట్‌కేసులో సర్దుతూ ఉండు - నేను నది ఒడ్డుకు పోయి ఎన్ని నీళ్లు వచ్చాయో చూసొస్తాను-" చెప్పాడు.

కర్నూలు పట్టణంలోని రోజా ఏరియాలోవున్న అతిపురాతన వాడ వారిది. క్రింది మూడుగదులు-పైన రెండుగదులు గల రెండుసెంట్ల ఇల్లు వారిది. ఎక్కువ భాగం ముస్లిం కుటుంబాలు కాపురం వుంటున్నాయి. చౌకగా వచ్చిందని నరహరి నాయన ఆ మిద్దెను కొన్నాడు యిరవైసంవత్సరాల క్రిందట. కర్నూలునగరం హిందూ - ముస్లింల సమైక్యప్రదేశం. జనాభా దాదాపు సరిసమానంగా ఉంటారు. భాయిభాయిలాగా ప్రవర్తిస్తూ ఉంటారు ఇద్దరూ.

హైద్రాబాదులోగాని - ఉత్తర భారతదేశంలోగాని హిందూ ముస్లిం తగాదాలు - గొడవలు వచ్చినా కర్నూలు మటుకు ఇరుమతాల మధ్య సమైక్యతనే చవిచూసింది.

ఆ ప్రాంతంలో ఒక ముస్లిం అవధూత సమాధి ఉండటం వలన ఆ కాస్త ప్రాంతాన్ని 'రోజా' అని పిలుస్తారు కొంచెం దూరంగా తుంగభద్రనది ప్రవహిస్తుంది. అది ఎప్పుడో వర్షా కాలంలో తప్పించి ఎప్పుడూ ఎండిపోయి – యిసుక మేటతో కనిపిస్తూ ఉంటుంది.

నందిని పిల్లలవి నాలుగు జతల బట్టలు – తనవి రెండు జతలు – భర్తవి రెండు జతలు ఒక సూట్‌కేసులో సర్దింది. ఇంకేం తీసుకుపోవాలి? నిజంగా వరద వస్తే ఏం కావాలి? తిండి తిప్పలు?

మంచినీళ్ళు ఒక పెద్ద ఫ్లాస్కులో – బిస్కత్తులు – చాక్లెట్లు – రొట్టెలు – పండ్లు – ఒక క్రరల సంచీలో సర్దింది.

ప్రతి సంవత్సరం తనకు తలనెప్పే ! కర్నాటకలో హోస్పేట డ్యాము నిండి – నీళ్లు పొర్లి పొంగుతూ ఉంటే – కర్నాటక ప్రభుత్వం ఆనీళ్లని ఒక్కసారి వదులుతుంది. దగ్గరలోని సుంకేశుల డ్యాము నిండిపోతే అక్కడ వదలబడిన నీళ్ళు – కర్నూలు నదీ పరివాహక ప్రాంతాలను ముంచుతూ శ్రీశైలం డ్యాము చేరుకుంటూ ఉంటాయి. ఈలోగా ఎన్నో లక్షల ఎకరాలు మునుగుతాయి.

మనిషి వ్యాపకత్వానికి అడవులు – కొండలు నశించిపోయాయి. ఇంకా స్థలాలు చాలక నదులను ఆక్రమిస్తున్నాడు. శ్మశానాన్ని కూడ వదలకుండా అక్కడా ఇళ్లు కట్టుకుంటున్నాడు. కర్నూలు లోను జరిగింది అదే ! అది నది ఒడ్డు అన్న విచక్షణ లేకుండా – తుంగభద్ర తీరంలో ప్రజలు బాగా ఇళ్లు కట్టుకున్నారు – హంద్రీ ఒడ్డున కూడా ఇళ్లు కట్టుకున్నారు. ఆరెండు పేరుకు నదులే గాని ఎప్పుడూ ఎండిపోయి ఉంటాయి కనుక. కాని ఈమధ్య పైన కట్టిన భారీ ఆనకట్టలు హోస్పేట డ్యాము – ఆలమట్టి డ్యాము వగైరాలు – కర్నూలు నగరానికి తలనెప్పిగా తయారయ్యాయి. అక్కడ జలం లెక్కకు మించి అధికం అయితే – అది కర్నూలు వాసుల పాలిట యమగండం అవుతున్నది.

"అమ్మా! నీళ్లు వచ్చేస్తున్నాయి – నాన్నా రాలేదూ – " బుజ్జిగాడి చిలక పలుకులు–

" అటు చూడమ్మా ! మన వీధిలోకి కూడ వరదనీరు వచ్చేసింది –" పప్పి చెప్పింది.

" అయ్యో ! ఇప్పుడెలా? ఈయన చూసి వస్తానని చెప్పి యింకా రాలేదు" నందిని కంగారుగా అరిచింది.

నందిని తన సెల్లు ద్వారా నరహరిని కాంటాక్టు చేసింది. " ఏవండీ! ఎక్కడున్నారు? మన దగ్గర నీళ్లు వచ్చేశాయి?"

" ఆ ! వస్తున్నా – కారు కాని – ఆటో కాని దొరుకుతుందేమోనని వెదకుతున్నా!" నరహరి యింకా వెతుకుతూ బదులిచ్చాడు.

" మీ పిచ్చి కాని - అవి దొరికే సరికి మనిల్లు కూడా మునిగిపోతుంది - మీరు రండి - ఇంటికి తాళాలు వేసి బయటపడదాం! ఇక్కడ నీళ్లు మనింటి ముందు గుమ్మం దాకా వచ్చాయి." చెప్పింది నందిని.

" సరే - వస్తున్నా ! వస్తున్నా - రెడీగా ఉండండి - "

నరహరి ఆటోలు దొరుకుతాయన్న ఆశతో రోడ్డు మీద కొచ్చాడు కాని - అక్కడ అటువంటివి ఏవీ కనపడ్డం లేదు. అప్పటికే దొరికిన వాహనాల్లో భయకంపితులైన ప్రజలు పారిపోయారు. నది ఒడ్డు చూసే సరికే నరహరికి అర్థం అయింది ఇది ప్రతి ఏటా వచ్చే వరద కాదని - యిదేదో సునామిలా కొంపలు ముంచడానికే వస్తున్నదని.

ఎంక్వయిరీ చేస్తే తెలిసింది. లక్ష క్యూసెక్కుల నీరు వదిలారని సుంకేసుల డ్యాం ప్రమాదంలో ఉందని - కర్నూలు మునిగిపోవచ్చని.

నరహరి యింక దేవుడిచ్చిన కాళ్ళను నమ్ముకుని వెనక్కి తిరిగాడు. తన అశ్రద్ధకు తిట్టుకున్నాడు - తనకారును రిపేరుకుయిచ్చాడు - అది గ్యారేజిలోవుంది... ఏవో పార్ట్సు పోయాయి - తెప్పియ్యాలి... పాతిక వేలు ఖర్చు వస్తుంది అంటే వెనకాముందు ఆడుతూ ఉండిపోయాడు - అది అమ్మేసి యింకేదన్నా సెకండుహ్యాండు తీసుకుందామని ఆలోచిస్తున్నాడు.

ఇప్పుడు చేతిలో కారు ఉంటే ఎంత బాగుండేది!

నరహరి తన వీధి చేరుకునే సరికి పరిస్థితి విషమిస్తున్నది. వీధిలో అంతా నీళ్లు ! ఎత్తు పల్లాలను ఏకం చేస్తూ ప్రవహిస్తున్నాయి- ఇంటి అరుగులదాకా వచ్చాయి. పాత ఇళ్లు రోడ్డుకంటే తక్కువ ఎత్తులో కట్టుకుని ఉంటే గడపదాటి లోపలికి ప్రవహిస్తున్నాయి.

అదురుతున్న గుండెలతో ఇల్లు చేరుకున్నాడు.

ఇంటి ముందు నీళ్లు - ఇంటిలోపలికి కూడ వచ్చేశాయి.

దిగాలుగా యింటిలోపలికి వచ్చాడు... మోకాళ్ళలోతుదాకా ఉన్నాయి...

అది డూప్లెక్సు యిల్లు - ఇంటిలోపలి నుండే పైకి మెట్లు ! నందిని - బుజ్జి - పప్పి పైనుంచి అరుస్తున్నారు ....

" నాన్నా ! తొందరగా పైకిరా !" బుజ్జి

" ఇంతసేపు ఎక్కడికెళ్ళావు ?" పప్పి.

" ఏవండీ నీళ్లు మహాజోరుగా వస్తున్నాయి - ఆ కటాంజనం వేసి పైకి రండి..." చువ్వల తలుపు వేసి రమ్మని అడిగింది నందిని.

పాతకాలం నాటి ఇల్లు.

సింహద్వారం ఆకాలంనాటి చెక్కలతో తయారు చేశారు. కొన్ని తలుపుల చెక్కలు

పుచ్చిపోతున్నాయి. రిపేరు చేయించాలంటే లక్షలతో పని - దాని బదులు కొత్త ఇల్లు కట్టుకోవచ్చని అతని అభిప్రాయం ! కాని పుట్టి పెరిగిన ప్రాంతం వదలి పోవాలంటే మనసు రాదు.

గుడ్డిలో మెల్లలాగా - దొంగలు వచ్చి తంతే తలుపులు విరిగిపోతాయని కటాంజనం వేయించాడు వాళ్ళనాన్న ! రాత్రిపూట ఆ ఇనుప చువ్వల తలుపులకి తాళం వేస్తారు... గుండెలమీద చెయ్యివేసుకుని నిద్రిస్తారు. కొత్త ఇల్లు కట్టుకునే స్తోమత ఉన్నా పని నడుస్తున్నదన్న అశ్రద్ధ!

" ముందు తాళాలు తీసుకున్నావా?" నరహరి అరిచాడు కిందనుంచి.

" ఆ ! తాళాలు అయితే నాదగ్గరే వున్నాయి - వాటి అవసరం ఏంటి?" నందిని అడిగింది పై నుండి.

" మీరంతా దిగివస్తే - తలుపులకు తాళం వేసి బయటకు పారిపోదాం! " నరహరి చెప్పాడు పెరుగుతున్న నీరును చూసి.

" అదెలా ! నీళ్లు వచ్చేస్తున్నాయి- ఇప్పటికే బయట మోకాలులోతు ప్రవహిస్తున్నాయి-" నందిని కొంచెం కిందకు దిగివస్తూ చెప్పింది.

" అందుకే మనం వీలైనంత తొందరగా ఇక్కడనుండి బయటపడాలి! అన్నీ రెడీనేగదా !" నరహరి అడిగాడు.

నందిని - ఆమె వెంట బుజ్జి - పప్పి కిందకు వచ్చారు - అప్పటికే ఆ హాలులోకి అడుగులోతు పైన నీళ్లు చేరిపోయాయి. నందిని నేలమీదున్న వస్తువులను పైన సర్దిపెట్టింది అంతకుముందే!

" నిజమే నండి - కాని ఆలోచించండి - రోడ్డు కంటే కొంచెం ఎత్తుగా వున్న మనింట్లోకి అడుగులోతు నీళ్లు చేరిపోయాయంటే బయట ఎంత ఎత్తున నీళ్లు పారుతున్నాయో !" నందిని భయంగా అడిగింది.

" కానీ, మోకాలు లోతు రానీ - ఇంకా నడుందాకా రానీ ! మనం వెంటనే వెళ్ళకపోతే ఇంకా మునిగిపోతే ఏం చేస్తాము?" నరహరి.

" నిజమే ! కాని ఈ సూటుకేసు బరువుతో - చంటిపిల్లలతో బయట పడగలమా?" నిస్సహాయంగా అడిగింది.

" పిల్లలిద్దరిని నేను భుజాలమీద ఎక్కించుకుంటాను- నువ్వు ఆ సూట్‌కేసు నెత్తిన పెట్టుకుని - ఆసంచీ చేతిలో పట్టుకుని నడు -" అంటూ నరహరి ఆమె అందించిన తాళం తీసుకుని ముందుకు నడిచాడు, కటాంజనంకు తాళం బిగించిన తరువాత.

నీళ్ళల్లో జాగ్రత్తగా నడుచుకుంటూ - ప్రహరీ దాటి వీధిలోకి వచ్చారు - వాళ్ళ

ఇల్లు ఆవీధిలో కొంచెం ఎత్తులో ఉంది. వాళ్ళ ఇల్లు దాటి రెండు మూడు ఇళ్ళ తర్వాత డెడ్ ఎండ్ ! దారిలేదు. వాళ్ళ ఇంటినుండి కిందికేసి నడవాలి – ఆ వీధి దాటి పోవాలంటే!

బయటకొచ్చి – వీధిలోనికి చూసిన నందిని 'కెవ్వు' మని అరిచింది... "బాబోయ్ ! నీళ్లు ! మునిగిపోతాం !"

నరహరి పరిశీలనగా చూశాడు – వీధి మొదలుకు – తాముండే చోటుకు ఐదడుగల తేడా ఉంది. అంటే నడవడం మొదలు పెడితే తలకూడ మునిగిపోవచ్చు.

ఆకాశం నుండి సన్నజల్లు యింకా పడుతూనే వుంది. సూర్యాస్తమయం జరిగిపోనున్నది. చలిగాలి వీస్తున్నది. నిర్జనంగా – నిర్లజ్జగా – జలం జలం !

" వద్దండి ! బ్రతుకో – చావో మనింట్లోనే ఉందాం! లోపలికి పదండి – " నందిని ప్రాధేయపూర్వకంగా అడిగింది, భయపడిపోయి.

" ఎందుకు భయపడతావు – నేను గజ ఈతగాడినని నీకు తెల్సుగా " నరహరి అడిగాడు, ఆమెకు తన బాల్యం గుర్తు చేస్తూ.

" మీరు కావాలంటే వెళ్ళిపోండి – మేము ఇంట్లోనే ఉంటాం – " అంటూ వెనక్కి తిరిగింది, ధైర్యం చాలక. భర్తకు ఈతవచ్చని ఆమెకు తెల్సు.

అప్పటికే బుజ్జిగాడు – పప్పీలు ఏడ్పులు లంగించుకున్నారు.

గత్యంతరం లేక నరహరి ప్రహరిదాటి లోపలికి వచ్చి, తలుపులు తెరిచి యింటి లోపలికి కొచ్చి, మళ్లీ కటాంజనంకు తాళం పెట్టి తలుపులు మూసేసి మేడమెట్లు ఎక్కాడు.

నందిని, బుజ్జి, పప్పి కూడ మెట్లెక్కి పైకి వచ్చారు.

" ఇంకా నీళ్ళొస్తే ఏం చేస్తావు నందిని?" నరహరి అడిగాడు అసహనంగా.

" పైకి స్లాబు మీదకి ఎక్కుదాం !" ధైర్యం కూడ గట్టుకుని చెప్పింది.

ఇంటి టాపుమీదకి ఎక్కడానికి చెక్కమెట్లున్నాయి. కొంచెం జాగ్రత్తగా ఎక్కాలి. అది కూడ మునిగిపోతే ఏం చెయ్యాలి? అంత ఎత్తున నీళ్లు రావని ఓ గుండె ధైర్యం. మొండి ధైర్యం! గత అనుభవాలు !

నరహరి కింద యింటిలో వున్న టీవీని, డివిడి ప్లేయర్ని, వాషింగ్ మెషిన్ని, బట్టల్ని నెమ్మదిగా పై అంతస్తుకు చేరవేశాడు ఒక్కొక్కటి.

నందినికూడ వంట యింట్లోని కొన్ని సామానులను పైకి చేరవేసింది.

నిమిషాలు – గంటలు గడిచేకొద్దీ నీళ్లు పైపైకి వస్తున్నాయి.

నరహరి చాలా సేపు ఆ పాత బీరువా దగ్గర ఉండిపోయాడు.

అతని ఆస్థి అది! దాన్ని పైకి తీసుకుపోవాలంటే కనీసం నలుగురు ఎత్తుకు రావాలి! బీరువాకు తాళాలు వేసి వున్నాయి.

దాంలోనే అతని నల్లధనం - నగలు - డాక్యుమెంట్లు వగైరాలున్నాయి- నీళ్లు లోపలికి పోకుండా బీరువా తలుపులకు గంటేపు అంటించాడు.

" నీళ్ళల్లో నానుతున్నారు - ఇంక పైకి రండి -" నందిని పిలిచింది.

కటాంజనంను, తలుపులను ఒక్కసారి పరీక్షించి మెల్లగా నడుచుకుంటూ మెట్లెక్కి పైకి వచ్చాడు. అక్కడ రైలింగు పట్టుకుని కిందకి చూస్తూ కుర్చీలో కూర్చున్నాడు. నడుందాకా నానిపోయి ఉన్నాడు.

కర్నూలుకు యింతటి దుస్థితి ఏనాడు రాలేదు, గత నూరు సంవత్సరాలుగా! వార్తలు విందామంటే కరెంటు పొద్దుటి నుండి లేదు.

సెల్లులో కబుర్లు తెల్సుకుందామంటే లైన్సు తగలడంలేదు.

బాల్కనీలోకి వచ్చి చూసినా జనసంచారం కనపడ్డంలేదు.

చిమ్మచీకటి ! ప్రవాహం వేగం పెరిగినట్లుంది.

" నాన్నా ! అటు చూడు !" బుజ్జి అరిచాడు, టార్చిలైటు వేస్తూ .

నరహరి వీధిలోకి అటువైపు చూశాడు.....

పాతమిద్దె మునిగిపోయి ఉంది... ఇప్పుడు దానిమీద గదికూలిపోయి కింద పడుతున్నది ప్రవాహ వేగానికి. శిథిలమవుతున్నది మట్టిమిద్దె!

ప్రళయం వచ్చినట్లుంది - చెవులు చిల్లులు పడే హోరు శబ్దం !

చల్లటి చలిగాలి ! నల్లగా జలప్రవాహాలు ! పాముల బుసలు - కప్పల బెకబెకలు.

నందిని జపమాల తీసుకుని జపం చేస్తున్నది- దేవుడు కాపాడాలని.

క్రింద శబ్దాలు అధికం అవుతున్నాయి.

జల ప్రవాహం ఇంటి తలుపులను ఢీకొడుతున్నట్లుంది.. ఢంఢంఢం!

అప్పటికే నీరు బీరువా ఎత్తుకు వచ్చేసింది...

ఇంకో అరడుగులు వస్తే తాము కూడా డాబా మీదకి ఎక్కాలి.

టార్చిలైటు వేసి చూశాడు నరహరి.

కుర్చీలు - బల్లలు నీళ్ళల్లో తేలుతున్నాయి. వంటింట్లోని కొన్నిసామాన్లు కూడా నీళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్నాయి. జలానికి అంత బలం ఉంటుందని అప్పుడే తెల్సింది.

" దేవుడా దేవుడా !" అంటూ ప్రార్థిస్తున్నాడు.

ఇంతలో పెద్ద శబ్దం అయింది - ధాం అంటూ. ఇంటి తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. కటాంజనం తలుపులు కూడ నేలపాలయ్యాయి.

ప్రవేశ ద్వారం స్థానంలో పెద్ద గండి గోడలకు - భళ్ళున నీళ్ళు లోపలికి.

" ఓ మైగాడ్ ! ఎంత ఘోరం ! " నరహరి అరిచాడు.

" అయ్యో ! మన తలుపులు విరిగిపోయాయి." నందిని వాపోయింది.

" నాన్నా ! నీళ్ళు బీరువాను కూడ మింగేశాయి. బీరువా నీళ్ళల్లో తేలుతున్నది..." బుజ్జిగాడు చెప్పాడు కేరింతలు కొడుతూ.

" చూడునాన్నా ! బీరువా కూడ ఎలా అటూ యిటూ తిరుగుతున్నదో !" పప్పి చెప్పింది ఆశ్చర్యంగా .

నీళ్ళ ప్రవాహంలో బీరువా పైకి లేచి బోర్లాపడి కాసేపు మేడ మెట్లకు కొట్టుకుంది! ఎవరో తోస్తున్నట్లు ముందుకు వెనక్కి కొట్టుకుంటున్నది. ధనధనమని శబ్దాలు....

" నా బీరువాని కాపాడుకోవాలి!" నరహరి అరచి కిందకి దిగబోయాడు.

" వద్దండి - వద్దు - మీకేమన్నా అవుతుంది - బీరువా పోతే కొత్తది కొనుక్కుందాం!" నందిని భయపడుతూ చెప్పింది.

" ఒసే మూర్ఖురాలా ! అది ఉత్తబీరువా కాదే ! నా ముప్పది సంవత్సరాల సంపాదన! అంతా దాంట్లోనే ఉంది - బ్లాక్ మనీ - నగలు - అన్నీ -" అంటూ మెట్లు దిగడానికొచ్చి అక్కడ నిల్చుండి పోయాడు...

ఆ మెట్లుకూడ - చెక్కమెట్లు - నదీ ప్రవాహానికి - ఊగులాడుతున్నాయి- బ్యాలెన్సు తప్పితే కిందపడ్డం ఖాయం!

ఇంతలోనే బీరువా అటూ యిటూ కొట్టుకుంటూ వరద నీటి వేగానికి బయటకు వెళ్ళిపోయింది తేలుతూ ! నరహరి చూస్తుండగానే!

" అయ్యో ! నా బీరువా పోయింది నందిని! నా బీరువా పోయింది. అది లేకపోతే నే బ్రతకలేను" ఏడుస్తూ చెప్పాడు - టార్చిలైటు ఫోకసు చేస్తూ.

నందిని కూడా నిశ్చేష్టురాలై నిల్చుండి పోయింది జరిగిందానికి.

" మీరిక్కడే ఉండండి - బీరువాను పట్టుకొస్తాను-" ఫుల్‌హ్యాండ్సు స్వెట్టర్ విప్పుతూ చెప్పాడు ఈదడానికి సిద్ధపడుతూ.

" నాన్నా ! మమ్మల్ని వదిలి వెళతావా?" పప్పి అడిగింది.

" నాన్నా ! నువ్వు లేంది మేము బ్రతకలేం !" బుజ్జిగాడు అన్నాడు భయంగా.

నందిని తేరుకుంది - "ఆగండి ! ఏవిటా పిచ్చి ఆవేశం! బీరువా కోసం ఎక్కడికని వెళతారు? పోతే పోయింది. ఎలా పట్టుకుంటారు? "

" అందులో యాభైలక్షల విలువైన వస్తువులున్నాయి. నా బంగారు వ్యాపారంలో అక్రమంగా ఆర్జించిన బ్లాక్‌మనీ - నగలు - సర్టిఫికెట్లు చాలా ఉన్నాయి. నందినీ ! నాకేం కాదు నేను గజ ఈతగాడిని!" చెప్పాడు నరహరి!

" నిజంగా మీకేం కాకపోవచ్చు - కాని మీరు వెనక్కి వచ్చేలోగా మేముంటామని

గ్యారంటీ ఏంటి?" నందిని అడిగింది లాజికల్‌గా.

నరహరికి వెన్నులో చలి పుట్టింది.

" అంటే - నువ్వనేదేంటే ?" ఊహించడానికి భయపడుతూ అడిగాడు.

" చూశారుగా - వరద నీరు ఎలా ఎక్కువవుతున్నదో ! ఇంకాసేపటికి మన మేడ మీదకి వస్తుంది... మనం డాబా ఎక్కాలి! ఈ పిల్లలిద్దర్నీ నామీద వదిలేసి మీరు వెళితే నేను వాళ్ళను జాగ్రత్తగా డాబా ఎక్కించలేక పోతే ! ఆలోచించండి ! మీరున్నారని మా ధైర్యం ! మీరు లేకపోతే యింక మాకు బ్రతుకెందుకు? " నంది వెక్కి వెక్కి ఏడ్చింది.

" నేనెక్కడికి పోతాను - ఆ బీరువాను లాక్కుని వస్తాను -" నరహరి.

" మాకంటే మీకు ఆ బీరువా - బీరువాలోని నగలు - డబ్బు ముఖ్యమా?" నందిని ప్రశ్న. ఆమె గొంతులో ఆగ్రహం కనిపించింది.

దీనంగా చూస్తున్న పిల్లలు!

ఇంతలో చెక్కమెట్లు జారి కిందపడిపోయాయి శబ్దం చేస్తూ.

" అయ్యో ! యాభై లక్షలు ! సర్వనాశనం !" ఏడ్చేశాడు నరహరి.

" నాన్నా ! నీళ్లు మిద్దేమీదకి వస్తున్నాయి - " బుజ్జి చెప్పాడు.

" ఏం చేద్దాం నాన్నా !" పప్పి ఆందోళన.

" వద్దు - ఇంక ఆలశ్యం చెయ్యద్దు - డాబా మీదకు ఎక్కుదాం !" నందిని.

గబగబ బయటున్న చెక్కమెట్ల వద్దకు చేరుకున్నారు - అది ఎండకు ఎండి వానకు తడిసి బాగా జీర్ణావస్తలో వుంది...

" బుజ్జీ ! జాగ్రత్తగా పైకి పద - " చెక్కమెట్లమీదకు ఎత్తి నిల్చో పెడుతూ చెప్పాడు... ఏడ్పు ఆపుకుంటూ - యాభై లక్షలు ! యావజ్జీవిత సంపాదన !

" నాకు భయం - పప్పీని ముందు పంపు - " బుజ్జి చెప్పాడు...

పప్పిని ఎత్తుకుని ఆరో మెట్టుమీద దించాడు -పప్పి గబగబ పైకి ఎగబాకి పోయింది. బుజ్జి అనుసరించాడు ధైర్యం తెచ్చుకుని.

నందిని సూట్‌కేసు బరువును మోస్తూ ఆయాసపడుతూ మెట్లెక్కసాగింది.

" సూట్‌కేసు నాకివ్వు - తర్వాత విసిరి వేస్తాను " చెప్పాడు నరహరి.

ఆమె అతి నెమ్మదిగా పాకుతూ పైకి ఎక్కింది - మెట్లు కిర్రు కిర్రుమని శబ్దం చేస్తున్నాయి. ఏక్షణాన్నానైనా విరిగిపోవచ్చు ఆమె బరువుకు ఆమె స్థూలకాయురాలు.

అప్పటికే మోకాలులోతుకు నీళ్లు వచ్చేశాయి మేడమీదకు .

నరహరి కూడ పైకి ఎక్కాడు ...... సూటుకేసు బలం కొద్దీ పైకి విసిరివేసి.

దేవుడి భజన చేసుకుంటూ కూర్చున్నారు నలుగురూ!

గంటలు గడిచిపోయి - తెల్లవారింది. కొత్తయుగం మొదలైన అనుభూతి.

జలసముద్రంలో ఉన్నట్లు భావన ! అక్కడక్కడ మేడల మీద నిల్చున్న జనం ! వీధులను ఇళ్ళను ఏకం చేస్తూ వరద నీరు....నీటిలో తేలుతూ జంతువుల కళేబరాలు - చెత్తాచెదారాలు. సహాయం కోసం ఎదురుచూస్తూ తిండి తీర్థాలు లేకుండా వరదబాధితులు-

శుభవార్త ఏమిటంటే నీళ్ళ ప్రవాహం తగ్గుతున్నది.

" నా అక్రమ సంపాదన పోయింది. ఫర్వాలేదు - సక్రమ సంపాదన అయిన మీరు నాకు దక్కారు" నిట్టూరుస్తూ అన్నాడు. నరహరి, భార్యా, పిల్లల్ని చూసుకుంటూ. అతని మనసు స్థిమిత పడుతున్నది.

పైకి పోయేటప్పుడు ఏమీ ఎత్తుకుపోలేము అన్న జీవితసత్యం అనుభవపూర్వకంగా అర్థమైంది నరహరికి.

- రచన - మే 2002